

వరద బాధితులను ఆదుకుంటాం

వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సార్వా సీజన్ ప్రారంభంలోనే అధిక వర్షాలు, ఎగువ నుంచి వచ్చిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను సత్వరం ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరపు అచ్చెం నాయుడు అన్నారు. శనివారం మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రులో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటన చేశారు. ఈ బృందంలో రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, టిడిపి, జనసేన నాయకులు, స్థానిక ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ గోదావరి ఉగ్రరూపం

- భద్రాచలం వద్ద 53 అడుగులు దాటిన నీటిమట్టం
- కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను చుట్టుముట్టిన వరద
- రోడ్లపైకి వరద చేరడంతో రాకపోకలు బంద్
- మరికొన్ని గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు



యలమంచిలి మండలం చించినాడ వద్ద కొబ్బరితోటల్లోకి చేరిన గోదావరి వరద

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. గంటగంటకూ వరద ఉధృతి పెరుగుతుండటంతో విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53 అడుగులు దాటేసింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 33.400 మీటర్లకు చేరింది. దీంతో 11.65 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి పెరగడంతో ప్రధాన రహదారులపైకి నీరు చేరుతోంది. దీంతో చాలా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు-భద్రాచలం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం వెళ్లే బస్సులను నిలిపివేశారు. బూర్గంపాడు-వేలేరు, వేలేరు-వెంకటాపురం, వింజరం-చీరవల్లితోపాటు ఇతర గ్రామాల మధ్య రహదారులపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వరదనీరు గ్రామాలను చుట్టుముట్టడంతో కుక్కునూరు మండలంలోని ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం, బెస్తగూడెం ఎస్‌సి కాలనీ ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలొచ్చారు. వేలేరుపాడు మండలంలో కొయిదా వంటి అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నీటిమట్టం 55 అడుగులకు చేరితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 35 గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించక తప్పదు. 2023 జులైలో వచ్చిన వరదలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 56.1 అడుగులకు చేరడంతో అప్పట్లో దాదాపు 13 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 1976 నుంచి ఇప్పటి వరకూ అత్యధికంగా భద్రాచలం వద్ద 2022లో 71.3 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వంద గ్రామాలకుపైగా నీట మునిగాయి. ఇళ్ల పైకప్పుల పైనుంచి వరద నీరు ప్రవహించింది. 20 వేల కుటుంబాలకుపైగా సర్వంకోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇళ్లు, సామాన్లు సర్వం దెబ్బతిన్నాయి. నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లోనే గడపాల్సి వచ్చింది. తాగునీటి కోసం జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోదావరి వరద తగ్గినట్లే తగ్గి పెరుగుతుండటంతో 2022 గోదావరి వరదలను జనం గుర్తుకు తెచ్చుకుని ఆందోళన చెందుతున్నారు. దీంతో ముందుగానే గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

వరద సాయంపై ఎందుకీ అలసత్వం

గోదావరి వరద ఉధృతికి పునరావాస కేంద్రాలకు చేరుతున్న, వరద ప్రభావంతో కొండలు, గుట్టలపైకి చేరిన వారికి వరద సాయం అందడంలో కొంత అలసత్వం కొనసాగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తిగా అందకపోవడంపై వరద బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రాలకు చేరి వారం రోజులవ్వగా శనివారం సైతం బియ్యం అందజేత పూర్తి కాలేదు. వరద పెరుగుతున్న నేపథ్యంలో పునరావాస కేంద్రాలకు మరికొన్ని గ్రామాలు తరలొచ్చే పరిస్థితి ఉంది. వరద సాయం అందజేతలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటేనే బాధితులకు పస్తులు తప్పుతాయి.

వణుకుతున్న లంక గ్రామాల ప్రజలు

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి వరద వారం రోజులుగా లంక గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గోదావరిని ఆనుకుని ఉన్న ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధి పెదమల్లంలంక, అనగారలంక, కోడేరు పంచాయతీ పరిధి పల్లెపాలెం, అయోధ్యలంక పంచాయతీ పరిధి అయోధ్యలంక, పుచ్చలంక, మర్రిమూల, పెద్దపేట, నకిలీలంక, రాయిలంక, నేతలవారిపేట గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గోదావరి ఉధృతి రెండు రోజులుగా తగ్గినట్లే తగ్గి శనివారం మరోసారి పోటెత్తడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల మధ్యలోకి వరద నీరు రావడంతో ప్రజలు ఇక్కడ నుంచి బయటకు రాలేకపోతున్నారు. దీంతో విద్యుత్ స్తంభాలు నీట మునగడంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో లంక గ్రామాల ప్రజలకు కిరోసిన్ సరఫరా లేక, ఇటు విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో మగ్గుతున్నారు. రాత్రి ఏడు గంటలు దాటితే కాలు కిందకు పెట్టలేని పరిస్థితి లంకవాసులది. వరద ప్రవాహానికి పాములు వస్తున్నాయని వారు భయపడుతున్నారు. వల్లూరు పిహెచ్‌సి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య సేవలందిస్తున్నారు. పాము, కుక్కకాట్ల ఇంజక్షన్లు అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారులు తెలిపారు. గ్రామాల చుట్టూ నీరు చేరడంతో అధికారులు, పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. మూగజీవాలకు మేత దొరకక అర్థాకలితో అలమటిస్తున్నాయి. ఎటువంటి విపత్తు పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక బృందాలను అందుబాటులో ఉంచింది. ఎస్ఐ రాజకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్పెషలాఫీసర్ పిచ్చయ్య, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ నరసింహప్రసాద్, రెవెన్యూ సిబ్బంది వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



ఆచంట మండలంలో గోదావరి ఉధృతి

యలమంచిలి: గోదావరి వరద శనివారం ఉదయం వరకు తగ్గినట్లే తగ్గి మళ్లీ సాయంత్రానికి మరింత పెరగడంతో లంక గ్రామాల ప్రజల్లో అలజడి మొదలైంది. మండలంలో కనకాయలంకతోపాటు పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల పల్లిపాలెం తదితర లంక గ్రామాల్లోకి మళ్లీ వరద నీరు చేరుకుంటుంది, దీంతో నిన్నటి వరకు ఊపిరి పీల్చుకున్న ఆయా గ్రామాల ప్రజలు మళ్లీ తలలు పట్టుకుంటున్నారు. వరదల కారణంగా కనకాయలంక గ్రామానికి చెందిన విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఆ గ్రామంలో పదో తరగతి వరకు మాత్రమే చదువుకునే అవకాశం ఉండటం వల్ల ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కనకాయలంక కాజ్ వే దగ్గర నుండి పడవలపై ప్రయాణించి అమలాపురం, పి.గన్నవరం, జగన్నపేట, రాజోలు, మలికిపురం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. గోదావరి ఉధృతిని చూసి విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

ఐద్వా, శ్రామిక మహిళ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల ఏలూరు జిల్లాలో, తాజాగా ఆకివీడు ప్రాంతంలో బాలికలపై అత్యాచారాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా జిల్లా సమన్వయ కమిటీ, ఐద్వా డిమాండ్ చేశాయి. స్థానిక ప్రకాశం చౌక్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా నాయకులు డి.కళ్యాణి, ఐద్వా నాయకులు సరోజిని మాట్లాడారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. మత్తు పదార్థాలు, మద్యం, అశ్లీల సాహిత్యాన్ని అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు డి.జోతి, లక్ష్మి, లారెన్స్‌కుమారి, రాజేశ్వరి, శ్రామిక మహిళా నాయకులు వరలక్ష్మి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



నరసాపురంలో..



భీమవరంలో..

నరసాపురం: ఆకివీడు ప్రాంతంలో ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా ఆధ్వర్యాన రుస్తుంబాదలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ ఈ రెండు నెలల కాలంలో సుమారు 55 మంది మీద చిన్నారులపై అత్యాచారాలు జరిగాయని, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. దోషులను కఠినంగా శిక్షించి అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తూతిక సుధాజ్యోతి, గిరిజ, కార్తీక, రూప తదితరులు పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమన్పించి..!

గోదావరి వరద రెండు జిల్లాల ప్రజలతో దోబూచులాడుతోంది. అదే సమయంలో కేంద్ర బడ్జెట్ ఊరించి ఉసూరుమన్పించిదనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

గోదావరి వరద పెరుగుతూ.. తగ్గుతూ.. మళ్లీ పెరుగుతూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. సుమారు పది రోజులుగా గోదావరి వరద జిల్లావాసులతో దోబూచులాడుతోంది. అదే సమయంలో భారీ వర్షాలు జిల్లావాసులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. జూన్ ప్రారంభంలో పెద్దగా వర్షాలు లేకపోవడంతో అంతా పరిస్థితి ఎలా ఉంటుందోనని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తర్వాత పరిస్థితుల్లో మార్పులొచ్చినా ఇటీవల కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ వర్షాలతో ఏజెన్సీలో కొండవాగులు పొంగి రాకపోకలను అస్తవ్యస్తం చేయగా, డెల్టాలో పొలాలన్నీ ముంపుబారిన పడ్డాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. అదే సమయంలో కొవ్వాడ, ఎర్రకాల్వ, తమ్మిలేరు, వెంకయ్యవయ్యేరు తదితర కాల్వలు ఉధృతంగా ప్రవహించడంతో ముంపు సమస్య మరింత తీవ్రమైంది. దీనికితోడు డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు పెరిగిపోవడంతో అవి సక్రమంగా ప్రవహించని పరిస్థితి నెలకొంది. వెరసి నారుమళ్లు, నాట్లు ముంపుబారిన పడ్డాయి. అదే సమయంలో గోదావరి వరద ఉధృతి అటు విలీన మండలాల ప్రజలను, ఇటు లంక గ్రామాలవాసులను నిలువునా ముంచింది. దీంతో ఏలూరు జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాలు వరద తాకిడికి గురయ్యాయి. పంటలన్నీ పూర్తిగా దెబ్బతినగా కాజ్‌వేలు నీట మునగడంతో రాకపోకలు స్తంభించాయి. దీనికితోడు రుద్రంకోట తదితర గ్రామాల్లోకి నీరు ప్రవేశించడంతో చాలాచోట్ల జనం సమీప కొండలపైకి వెళ్లి తాత్కాలిక నివాసాలు ఏర్పర్చుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు విలీన మండలాల్లో పర్యటిస్తూ ఇటు యంత్రాంగాన్ని, అటు ప్రజలను అప్రమత్తం చేయడంతో కొంత నష్టంతోపాటు ప్రజల కష్టాలు కూడా తగ్గాయనే చెప్పొచ్చు. ఏదేమైనా



కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేరిస్తే విలీన మండలాల్లో ప్రజలకు గోదావరి కష్టాలు తప్పుతాయి. డెల్టాలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు యుద్ధప్రాతిపదికన చేపట్టడంతోపాటు వచ్చే వేసవిలోనైనా పూడికతీత పనులు చేపడితే ప్రకృతివైపరీత్యాల నష్టం నుంచి రైతులు ఎంతోకొంత బయటపడే అవకాశం ఉంది.

ఇక కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను ఊరించి ఉసూరుమన్పించిందనడంలో ఎటువంటి సందేహం లేదు. కేంద్రీయ విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు పెద్దగా లేకపోవడంతోపాటు కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్, కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగానే ఉన్నాయి. వాటికి నిధుల కేటాయింపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో మచిలీపట్నం-నరసాపురం మధ్య తీరప్రాంతం గుండా రైల్వే లైన్ నిర్మించాలనే ప్రతిపాదన సంతోషకరమే. అయితే చాలాకాలం నుంచి పెండింగులో ఉన్న కోటిపల్లి-నర్సాపురం, కొవ్వూరు-భద్రాచలం లైన్లకే అతీగతీ లేని పరిస్థితుల్లో మచిలీపట్నం-నరసాపురం కొత్త లైన్‌పై ఆశలు అత్యాశేనని జిల్లావాసులు పెదవివిరుస్తున్నారు. ఇక సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నరసాపురం-సఖినేటిపల్లి నడుమ నరసాపురం వద్ద వశిష్టగోదావరిపై వంతెన నిర్మాణం, నరసాపురం మండలంలో తీరప్రాంత గ్రామాలు కోతకు గురికాకుండా ప్రత్యేక ప్రాజెక్టు కింద రక్షణ గోడ నిర్మిస్తామని కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ గతంలో హామీ ఇచ్చారు. తీరప్రాంత కోత నివారణకు చర్యలు చేపడతామని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సైతం ప్రకటించిన నేపథ్యంలో ఆయన సొంత జిల్లా, నిర్మలా సీతారామన్ మెట్టినిల్లు అయిన పశ్చిమగోదావరిలో తీరప్రాంత కోత నివారణకు నిధులు కేటాయిస్తారేమోనని అంతా ఆశగా ఎదురుచూసినా నిరాశే మిగిలింది. మొత్తంగా కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను మరోసారి ఊరించి ఉసూరుమన్పించిందని రాజకీయ పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

వరద బాధితులకు అండగా ఉంటాం

మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారధి, అనిత, రామానాయుడు

ప్రజాశక్తి - తణుకు

వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారధి, అనిత, రామానాయుడు భరోసానిచ్చారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా వయ్యేరు-యనమదుర్రు కాలువలు ఉప్పొంగడంతో నీట మునిగిన తణుకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శనివారం వారు పర్యటించారు. తొలుత తణుకు మండలం దువ్వ గ్రామంలో నీట మునిగిన ప్రాంతాలను, నీట మునిగిన పంట పొలాలను ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, కలెక్టర్ నాగరాణి మంత్రులకు చూపించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వరద బాధితుల సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ఎవరూ భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, బాధితులకు అన్ని సౌకర్యాలూ కల్పించేలా చర్యలు చేపడతామని భరోసా కల్పించారు. అనంతరం దువ్వ గ్రామంలో బాధితులకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు.



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రులు



బాధితులకు సాయం అందిస్తున్న మంత్రులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోదావరి వరదలపై కలెక్టర్ నాగరాణి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

గోదావరి వరద పరిస్థితులను అధికారులు సమిష్టిగా సమర్థవంతంగా ఎదుర్కోవాలని, ఎక్కడ లోటు కనపడినా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేటులో గోదావరి వరద ఉధృతి, చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పోలీసు, విద్యుత్, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. గోదావరి వరద ఇంకా ఉధృతంగా కొనసాగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లంక గ్రామాల ప్రజలకు భోజన వసతులు, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పశువులకు నష్టం జరగకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడాలన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలు, సర్వే బాదులు, వెదురు తడికెలు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గోదావరి ఏటిగట్టు పటిష్టతకు నిరంతరం పరిశీలన చేసుకో వాలని, బలహీనత ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కన్జర్వెన్సీ అధికారులను కలెక్టరు ఆదేశించారు. బోట్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వరద పూర్తి అదుపులోకి వచ్చిన తర్వాత అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్య శాఖ అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఆర్‌డి ఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు బి.శివన్నా రాయణరెడ్డి, ఇరిగేషన్ ఇఇ దక్షిణామూర్తి, డిఇ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ్ భాస్కరరావు

భీమవరం: ఎపిపిఎస్‌సి నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేటులో ఎపిపిఎస్‌సి డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై పోలీసు, విద్యుత్, వైద్యశాఖ, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ ఐ.పద్మా లలితతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిపిఎస్‌సి నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షలకు జిల్లాలో ఈనెల 28, 30 తేదీల్లో జరగనున్న పరీక్షలకు 856 మంది అభ్యర్థులు రెండు రోజులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. జిల్లాలోని భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, అటానమస్ క్యాంపస్‌లలో, తాడేపల్లిగూడెంలో శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని డిఆర్ఒ తెలిపారు. ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయని, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయం కంటే గంట ముందు పరీక్షా కేంద్రంకు రావాలని సూచించారు. పరీక్షలు రాసే అభ్యర్థులకు రవాణాకు ఇబ్బందులు కలగకుండా ఆర్‌టిసి బస్సులు నడపాలని సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు, గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. నిరంతరాయగా పవర్ సప్లై ఉండేలా చూసుకోవాలని, ఒక జనరేటరు కూడా సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. వికలాంగులు, గర్భిణులు ఉంటే వారికి గ్రౌండు ఫ్లోరులో పరీక్షలు రాసేలా చూసి, ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, పోలీసు, విద్యుత్, హెల్త్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

భీమవరం: ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిహెచ్.లక్ష్మి అధ్యక్షతన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, మరికొన్ని పెండింగ్లో ఉన్నాయని, ఆ ప్రభుత్వం అంగీకరించి ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఆ పని కొత్త ప్రభుత్వం మీద పడిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంపై ఆశావర్కర్లు కూడా సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతోనే ఉన్నారని అన్నారు. తమది కాని పనిని తమతో చేయిస్తున్నారని ఆశావర్కర్లు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. దీనికి తోడు కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత వేధింపులు విపరీతంగా జరుగుతున్నాయని, అక్కడక్కడా వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయాన్ని పాలకులు గమనించాలని అన్నారు. ఆశావర్కర్స్ యూనియన్‌తో జిల్లా అధికారులు జాయింట్ సమావేశాలు జరిపి సమన్వయం చేసుకునే సాంప్రదాయం గతంలో ఉండేదని, ఈ కాలంలో ఆ పని ఆగిందని, మళ్లీ పునఃప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జ్యోతి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లారెన్స్ కుమారి, ప్రశాంతి, లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

మాటల్లోనే దళిత సంక్షేమం.. బడ్జెట్‌లో శూన్యం

కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజగోపాల్

భీమవరం: మాటల్లో ఉన్న దళిత సంక్షేమం బడ్జెట్‌లో కనిపించడం లేదని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుబాటి రాజగోపాల్ విమర్శించారు. శనివారం కెవిపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ అధ్యక్షతన సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళిత సంక్షేమంపై సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న సబ్‌ప్లాన్ ప్రకారం జనాభా ప్రాతిపదికన దళిత పేటల అభివృద్ధికై నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంచినీటి సౌకర్యం, డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు నిర్మాణం వంటి అభివృద్ధి పనులుకై సబ్‌ప్లాన్ చట్టం ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్ ప్లాన్‌ని పూర్తిగా పక్కనబెట్టడం అన్యాయమన్నారు. ఇటీవలకాలంలో ముంపునకు గురైన దళిత కాలనీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుంపగడప లైబ్రేరియన్‌కు డాక్టరేట్

ఆకివీడు : మండలంలోని దుంపగడప ఆంధ్రకేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ ఆవాల పెద్దిరాజు(మాజీ జర్నలిస్టు)కు అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి అవార్డు లభించింది. గ్రంథాలయ శాస్త్రంలో 'అవేర్నెస్ అండ్ యూజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ రిసోర్సెస్ అమాంగ్ ది ఫ్యాకల్టీ మెంబర్స్ అండ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ లైబ్రరీస్ ఇన్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎ.యూజర్ స్టడీ' అనే అంశములో పరిశోధన జరిపినందుకు గాను పిహెచ్‌డి పట్టాను యూనివర్సిటీ అందజేసిందని ఆయన శనివారం విలేకరులకు తెలిపారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దుర్గాపురం 38వ వార్డులో 200 మంది ముంపు బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక నాయకులు గంటా శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతం పట్టణానికి శివారున ఉండని, యనమదుర్రు పొంగినారో మొదట మునిగే ప్రాంతం ఇదేనని, దాతలు స్పందించి బియ్యం అందించడం గొప్ప విశేషమని అన్నారు. కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, అసగాని కృష్ణప్రసాద్, యూత్ సభ్యులు గొర్రెల గోపి, బి.చిన్నా, ఉండ్ర సత్యనారాయణ, పి.చిన్న, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

హైస్కూల్ సమస్యలు పరిష్కరిస్తాం

గణపవరం: గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తామని టిడిపి, జనసేన నాయకులు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌ను కూటమి నాయకులు పరిశీలించారు. అనంతరం హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో హెచ్ఎం ఎంవిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ హై స్కూల్ పాత బిల్డింగ్ శిథిలావస్థకు చేరిందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ఎంఎల్ఎ పచ్చమట్ల ధర్మరాజు, ఏలూరు ఎంపి పుట్టామహేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

పాఠశాలలో అబ్దుల్ కలాం వర్ధంతి

మొగల్తూరు: కలలు కనండి వాటిని సహకారం చేసుకోండి అంటూ యువతకు మార్గ నిర్దేశం చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రజల హృదయాల్లో చిరకాలం నిలిచి ఉంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడిపి ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం వర్ధంతిని ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు, వాటాల మాధవ రాజు, రాజేంద్ర బాబు, బర్రి శ్రీను, దొంగ రాంప్రసాద్, శ్రీను, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నేడు ఏలూరుపాడులో ఉచిత వైద్య శిబిరం

కాళ్ల: ఉచిత వైద్య శిబిరాలను ఏలూరుపాడు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరుపాడు లయన్స్ క్లబ్ సభ్యులు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రమణరాజు అన్నారు. శనివారం ఏలూరుపాడు గ్రామంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి భీమవరం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నాం. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు అతి తక్కువ ఖర్చుతో చేసి సరసమైన ధరలకు కళ్లజోళ్లు అందించామన్నారు.

ఉప సర్పంచి వేణుబాబుకు మాజీమంత్రి పరామర్శ

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచి, సీనియర్ వైసిపి నాయకులు కర్రి వేణుబాబు, ఆయన భార్య మండల జెడ్‌పిటిసి కర్రి గౌరీ శుభాషిణిలను మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం పరామర్శించారు. కర్రి ఆదిలక్ష్మి ఇటీవల కీర్తిశేషులైనారు. వారి నివాస గృహానికి విచ్చేసి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట పలువురు జిల్లా వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన

భీమవరం టౌన్: తోటి విద్యార్థుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ర్యాగింగ్ పేరిట మానసికంగా, శారీరకంగా హింసించడం నేరమని, అలాగే విద్యార్థులు చెడు వ్యసనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని భీమవరం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) బి.అప్పల స్వామి అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డిఎన్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించుటకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్, కాలేజీ అసిస్టెంట్ సెక్రటరీ శివరామరాజు పాల్గొన్నారు.

మానవత కేంద్ర కమిటీ డైరెక్టర్‌గా జానకీరామరాజు

గణపవరం: మానవతసంస్థ కేంద్ర కమిటీ డైరెక్టర్‌గా సాగిరాజు జానకీరామరాజు నియమితులైనట్లు శనివారం గణపవరంలో విడుదల చేసిన పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నిడమర్రు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన జానకీరామరాజు మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్‌గా సేవలందిస్తున్న ఆయనను కేంద్ర కమిటీ డైరెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా గజపతినగరంలో నూతన శాఖ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనెల 28వ తేదీన శ్రీకాకుళంలో జరిగే నూతన శాఖ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటామని అన్నారు. రాష్ట్రంలో సంస్థ ఆధ్వర్యంలో మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

వైరల్ జ్వరాలపై అప్రమత్తత అవసరం

ఆచంట: గత వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రబలుతున్న వైరల్ జ్వరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆచంట సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. శనివారం కొడమంచిలి పంచాయతీ కార్యాలయంలో సచివాలయం, పంచాయతీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ కొడమంచిలి గ్రామంలో ప్రతి ఏరియాలో ఎక్కడా కూడా నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి డి.నాని, ఎఎన్ఎంలు పుష్పరాజ్యంపాల్గొన్నారు.

జన్మభూమి పార్క్ అభివృద్ధికి శ్రీకారం

ఉండి: దాతల సహకారంతో ఉండి, ఆకివీడు రహదారిలోని కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు ఉండి టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శనివారం పార్క్ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు పార్క్ వెలుపల ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఆక్రమణలను తొలగించారన్నారు. పార్కును పూర్తిగా అభివృద్ధి చేసి సందర్శకులకు ఆగస్టు 15వ తేదీ నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సత్యనారాయణ, మేకా చంద్రబాబు, పోలుబోతు రాజు, కరిమెరక సత్య, శ్రీహరి రాజు ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి



కాళ్ల : కోపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కాళ్ల: బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ కాళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. కోపల్లె గ్రామంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ ఎవేర్నెస్ ప్రోగ్రామ్‌లో మిషన్ స్కీమ్స్ గురించి శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. పుట్టిన 21 రోజుల్లో డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్స్ తీసుకొని వెంటనే ఆధార్లు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : సమాజంలో మహిళలు, బాలికల పట్ల అందరూ జాగ్రత్త వహించాలని పెనుమంట్ర డివిజన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. శనివారం స్థానిక సెంటర్‌లో జరిగిన మిషన్ శక్తి అవగాహనా సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు మిషన్ శక్తి 100 రోజుల అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కౌన్సెలర్ పి.పూజ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వికలాంగులకు రగ్గులు, ఆహార పొట్లాల పంపిణీ

భీమవరం టౌన్: మానవసేవే మాధవసేవ అని, ప్రతి ఒక్కరూ సాటి మనిషిని ప్రేమించడం అలవర్చుకోవాలని, సేవాగుణమే ఉత్తములుగా తీర్చిదిద్దుతుందని వివేకానంద సేవా సమితి కార్యదర్శి నారాయణ రాజు అన్నారు. శనివారం స్థానిక వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వివేకానంద సేవా సమితి సహకారంతో 32 మంది వికలాంగులకు రగ్గులు, ఆహార పొట్లాలను అందించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ జలాలు అందించేందుకు కృషి చేయాలి

నరసాపురం: జెజెఎం పథకం ద్వారా హర్‌గర్ జైలు కార్యక్రమంతో సీతారామపురం సౌత్ గ్రామంలో స్వచ్ఛ జలాలు అందించుటకు కృషి చేయాలని సీతారామపురం సౌత్ గ్రామ సర్పంచి దొండపాటి వెంకటేశ్వరరావు(వెంకట్) అన్నారు. శనివారం సీతారాంపురం సౌత్ పంచాయతీలో జరిగిన ఒడిఎఫ్ ప్లస్ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సీతారాంపురం సౌత్ గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి పులాజి, జనసేన అధ్యక్షుడు ఇంటి మురళీ పాల్గొన్నారు.

మంచి నీటితోనే ప్రజారోగ్యం : ఎంఎల్ఎ

పెనుమంట్ర : ప్రజలందరి ఆరోగ్యం నీటిమీద ఆధారపడి ఉందని, స్వచ్ఛమైన నీటిని అందరూ పొందాలని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని భట్లమగటూరు గ్రామంలో స్థానిక ప్రముఖుల సహకారంతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీరు ఆర్వో వాటర్ ప్లాట్‌ను ఆయన ప్రారంభించారు. మండలంలోని టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రోటరీ క్లబ్‌కు అవార్డులు

పాలకొల్లు : పాలకొల్లు రోటరీ క్లబ్ 3020 కొత్త టీం ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ డిజిఎన్ గుత్తికొండ శ్రీరాం, డిస్టిక్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ విచ్చేశారు. గత సంవత్సరం రోటరీ క్లబ్ చేసిన అనేక సేవా కార్యక్రమాలకు పాలకొల్లు రోటరీ క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు, మరో 16 ఉత్తమ సేవా అవార్డులు లభించాయి.

శ్రీనివాస్‌కు అత్యుత్తమ గౌరవ డాక్టరేట్

నరసాపురం: ఏషియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ అకాడమీ ద్వారా బిజిబిఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్‌కు అత్యుత్తమ గౌరవ డాక్టరేట్ బిరుదు లభించింది. శ్రీనివాస్ సామాజిక సేవాకార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విశిష్ట సేవలు అందించినందుకు ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించిన ఆ సంస్థకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

మండల పరిధిలోని దుంపగడప గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. ఉండి మండలానికి చెందిన 16 ఏళ్ల ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన మైనర్ బాలికపై ఓ యువకుడు, అతని స్నేహితుడు ఉప్పుటేరు శివారున అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలానికి చెందిన మైనర్ బాలిక మానసిక వికలాంగురాలు, ఆకివీడులో ఉన్న అక్క వాళ్ల ఇంటి దగ్గర ఉంటుంది. ఈనేపథ్యంలో పార్క్ వద్ద ఆడుతుండగా బంధువుతో సహ ఎవరో వచ్చి ఆమెను తీసుకెళ్లి, ఈనెలలో రెండుసార్లు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక ఇబ్బందిని చూసి గమనించిన తల్లిదండ్రులు విచారించగా ఆకివీడుకు చెందిన గండికోట కృష్ణయ్య(29) అతని ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు, దీనికి ఫిర్యాదుదారుడు బంధువు కూడా సహకరించినట్లుగా ఫిర్యాదు చేశారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడ్ని, అతనికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, పలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు డిఎస్‌పి పర్యవేక్షణలో ఆకివీడు ఎస్ఐ బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ అన్ని పాఠశాలల్లో అనేక సమస్యలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ యుటిఎఫ్ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి కెవిఆర్ కృష్ణంరాజు, తహశీల్దార్ సిహెచ్.విజయశ్రీ, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పి.సూర్యనారాయణ రాజులకు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు గుత్తింది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామమూర్తి నాయుడు, గౌరవాధ్యక్షులు వి.జగ్గారావు పాల్గొన్నారు.

పంటల బీమాను విడుదల చేయాలి

ఉండి: గత సంవత్సరం బకాయి ఉన్న పంటల బీమాను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు దండు రామలింగరాజు, మాదాసి గోపి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి గాను పంటల బీమాను విడుదల చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఆ బకాయిని విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కాళ్ల: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి, యువత పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'టిడిపిలో ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యత'

మొగల్తూరు : టిడిపిలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం మొగల్తూరులోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కుటమి ప్రభుత్వంలో అందరూ సమన్వయంతో ఉండాలని సూచించారు. సత్తినేని సర్వేశ్వరరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, కలిదిండి కుమార్ బాబు పాల్గొన్నారు.

'శిక్ష సప్తాహ' కార్యక్రమ అమలు భేష్

హెచ్ఎం శ్యామ్ సుందరం

భీమవరం టౌన్: శిక్ష సప్తహ కార్యక్రమం అమలు భేష్ అని రాయలం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమ సుందరం అన్నారు. శిక్ష సప్తహ కార్యక్రమంలో భాగంగా శనివారం 6వ రోజు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ టి.లక్ష్మీకాంతం, రిటైర్డ్ ఉపాధ్యాయులు దండు సీతారామరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

నరసాపురం: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. నరసాపురం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు శిరస్త్రాణం వినియోగం, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.దానయ్య నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులపై పెంకు పురుగుల దాడి

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామంలో ఉన్న ఎఫ్‌సిఐ గోడౌన్‌కి సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులపై శనివారం మధ్యాహ్నం పెంకు పురుగులు ఒంటిపై వాలి దాడి చేయడంతో పలువురు విద్యార్థులకు దురదలు, దద్దుర్లతో ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ఈ సంఘటనపై స్కూలు ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మాధవికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సమస్యపై పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాడి రైతులు అవగాహనతో ఉండాలి

పాలకోడేరు: పాడి రైతులు వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహనతో ఉండాలని మండల పశువైద్యాధికారి తమ్మిశెట్టి హేమ సూచించారు. పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్థక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో వేంద్రలో ఉచిత పశు గర్భ కోసం వ్యాధులు చికిత్స శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 69 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి కడలి నాగేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

నందమూరి గరువు ఆంజనేయ స్వామి గుడి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మృతుడు కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామానికి చెందిన వి.శ్రీరామూర్తి(75)గా గుర్తించారు. మృతుడు ఆటోలో వెళుతుండగా ఆటోను ఒక పాల వ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు తాడేపల్లిగూడెం
H.M.O.P.No.46/2024

మధ్య
గంధం శ్రీను శివయ్య **S/o** గంధం నరసింహారావు, హిందూ, మేల్, 37 సం.లు, వ్యవసాయ కూలీ, **R/o** డోర్ నెం. 4-36, పంచాయితీ వీధి, పంచాయితీ కార్యాలయం వద్ద, పెదనింద్రకొలను గ్రామం, నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా -534195, సెల్: 95338 31232 ...**పిటీషనర్**
Vs
గంధం @ మోటూరి రామతులసి **W/o** గంధం శ్రీను శివయ్య, **D/o** మోటూరి వెంకటేశ్వరరావు, హిందూ, స్త్రీ, గృహిణి, వయస్సు 26 సం.లు, **R/o** డోర్ నెం. 3-95, కాపుల వీధి, వంగూరు గ్రామం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా -534002, సెల్: 94922 65067 ...**రెస్పాండెంట్**
పిటీషనరు తరపు వేసిన పత్రికా ప్రకటన U/ఆర్డర్ 5 రూలు 20 సీపీసీ ప్రకారం
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పై నెంబరు **H.M.O.P.** లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టువారి నుండి **H.M.O.P.** సమన్లు పంపినా మీరు అందుకోనందున సదరు నోటీసు సబ్‌సిస్ట్యూట్ సర్వీసునిమిత్తం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.కావున మీరు **ది.5-08-2024వ తేది ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ, హాజరు అయి సమాధానం తెల్పవలెను. లేనియెడల మీపై కోర్టు వారు పరోక్షమున తీర్మానం చేసి తదుపరి ఉత్తర్వులు జారీ చేయుదురు అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

శిరిగినీడి విజయకృష్ణ
అడ్వకేటు అండ్ నోటరీ,
మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్
తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం
తేది:26-07-2024